# విపశ్యన మాసపత్రిక

VOLUME:11 NO - 08 1 NOVEMBER, 2017

**(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)**

**విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖెత్త, వనస్థలిపురం, హైదరాబాదు – 70**



**"ధర్మవాణి"**

**సుదుద్దసమ్ సునిపుణమ్,**
**మత్థ కామనిపాతినమ్ ।**
**చిత్తమ్‌రక్ఖేథ మేధావీ,**
**చిత్తమ్ గుత్తమ్ సుఖావహమ్ ॥**

**......ధమ్మపదం 36**

**మనసుని అర్థంచేసుకోవటం క్లిష్టతరం. ఇది చాలా సూక్ష్మమైనది, తనకి నచ్చిన విధంగా నడుచుకుంటుంది. వివేకవంతుడు తన మనస్సుని సురక్షితం చేసుకుంటాడు. సురక్షితమైన చిత్తం సుఖాన్నిస్తుంది.**

## సంవేదనలు అంతమైనపుడు దుఃఖం అంతమవుతుంది

**(శ్రీ సత్యనారాయణ గోయంకా గారు సంవేదనలపై వ్రాసిన వ్యాసం యొక్క తెలుగు అనువాదము. ఇది ఆగష్టు, 1983లో హిందీ విపశ్యన పత్రికలో ప్రచురితమైనది.)**

శరీరంపై దుఃఖకరమైన సంవేదనలు కలిగినపుడు కలవరపాటుకు గురి అయి అవి వద్దు, వద్దు అనుకోవటము (ద్వేషం పెంచుకోవటం), సుఖకరమైన సంవేదనలు కలిగినపుడు వాటిలో లీనమైపోయి వాటిని కావాలి, కావాలి అనుకోవటం(రాగం పెంచుకోవటం) అనేది మన మనసులో ధృఢంగా నాటుకుపోయిన అలవాటు. అయినప్పటికి ద్రష్టాభావంతో మనం సంవేదనలను గమనించటం మొదలుపెడితే ఎన్నో సత్యాలు తెలుస్తాయి.

వాస్తవానికి ప్రతి సంవేదన స్పర్శ వలనే కలుగుతుంది. కళ్ళు చూసే విషయాలతో, చెవులు ధ్వనితో, ముక్కు వాసనతో, నాలుక రుచితో, శరీరం ఏదైనా స్పర్శ పదార్థంతో మనసు ఆలోచనలతో లేక శరీరంతో స్పృశించినపుడు మాత్రమే సంవేదన కలుగుతుంది. సంవేదన కలగటానికి స్పర్శ అనివార్యం. ఇది తిరుగులేని ప్రకృతి నియమం. ప్రత్యక్షంగా ఈ సత్యాన్ని విపశ్యన సాధన ద్వారా స్వానుభవంతో తెలుసుకోగలుగుతారు.

మనసులో ధృఢంగా పాతుకుపోయిన అలవాటు వలన సాధకుడు ద్రష్టాభావంతో సంవేదనలను గమనించటానికి ప్రయత్నం చేసినప్పటికీ పదేపదే ఈ రాగద్వేషాల ఊబిలోకి కూరుకుపోతుంటాడు. కొద్దిసేపు తలపైకెత్తి గమనించినప్పటికీ మరలా ఊబిలో కూరుకుపోయి రాగద్వేషాల ఒరవడిలోపడి గమ్యం లేనివైపు కొట్టుకుపోతుంటాడు.

సంవేదలను ఏవైనప్పటికీ వాటిలోనే తేలియాడుటకు మనసు అలవాటు పడినది. ఇదే అనుభవం పదేపదే కలిగినపుడు సాధకునకు క్రమంగా ఈ విషయం స్పష్టమవుతుంది. మనసుకు ప్రియమైన సంవేదనలు కలిగినపుడు వాటిని ఆస్వాదిస్తూ వాటిపట్ల రాగాన్ని పెంచుకోవటం, అప్రియమైన సంవేదనలు కలిగినపుడు వాటిని ఆస్వాదిస్తూ వాటిపట్ల ద్వేషాన్ని జనింప చేసుకోవటం అలవాటైపోయినది. మనసు యొక్క ఈ అలవాటును, పాలీభాషలో అస్సాదో (సంవేదనలను ఆస్వాదించటము) అని పిలుస్తారు. సంవేదన సుఖకరమైనదైతే ఆనందంలో తేలియాడుతూ సుఖాన్ని ఆస్వాదిస్తుంది. అదే దుఃఖకరమైన సంవేదన అయితే దుఃఖంలో కూరుకుపోయి దుఃఖాన్ని ఆస్వాదిస్తుంది.

సంవేదనకు అపారమైన కీడు కలిగించే శక్తి ఉంటుంది. దీనిని పాలీభాషలో "ఆదీనవ" అంటారు. సాధకుడు సంవేదనలను ద్రష్టాభావంతో గమనిస్తూపోతే ఈ ప్రమాదాన్ని తెలుసుకోగలుగుతాడు. సంవేదనలను ఆస్వాదించటమనే అలవాటు మనసులో రాగద్వేషాలను వృద్ధి చేసుకోవటమే అవుతుంది. రాగద్వేషాలు జనించినపుడు అవి సంవేదనలను వృద్ధి చేస్తాయి. తిరిగి ఆ సంవేదనలు రాగద్వేషాలను వృద్ధి చేస్తాయి. ఈ విధమైన విషవలయం (భవచక్రం) ఏర్పడి దానికదే వృద్ధి చెందుతుంటుంది. దీనినే పాలీభాషలో "దుఃఖ సముదయ గామిని పటిపద" అనగా దుఃఖాన్ని పెంచి పోషించే మార్గము అని అంటారు. గతంలో ఈ మార్గాన పయనించి ఎంతో సమయాన్ని వృధా చేసుకుంటూ దుఃఖాన్ని పెంచిపోషించు కొన్నానను విషయాన్ని సాధకుడు క్రమంగా తెలుసుకోగలుగుతాడు.

ఇప్పుడు విపశ్యన అభ్యాసం ద్వారా సాధకుడు సంవేదనలను ఆస్వాదించే అలవాటు నుండి సమతను వృద్ధి చేసుకొనే వైపుకు సాధన ప్రారంభిస్తాడు. ఇలా చేయటం వలన కనీసం క్షణింగానైనా దుఃఖం అనే విషవలయంలో నుండి బయటపడుతున్నాను, తన దుఃఖాన్ని తానే పెంపొందించుకోవటం మానుకుంటున్నాను అనేది తెలుసుకోగలుగుతాడు. అప్పుడు అతను ఖచ్చితంగా దుఃఖ నివారణకు దారిచూపే మార్గాన్ని కనుగొన్నట్లే. పాలీభాషలో దీనిని "దుఃఖ నిరోధగామిని పటిపద" అని అంటారు. దీనిని అనుసరించటం ద్వారా జీవితంలోని దుఃఖాలన్నింటిని నిర్మూలించుకోగలుగుతాడు.

సాధకుడు ఈ స్థాయికి చేరిన తరువాత, శారీరక సంవేదనలు ఎంతముఖ్యమైనవో తెలుసుకోగలుగుతాడు. ఈ సంవేదనల కూడలి నుండి

రెండు మార్గాలు పోతున్నాయి. ఒకటి దుఃఖాన్ని పెంచి పోషించేదైతే మరొకటి దుఃఖాన్ని పూర్తిగా నిర్మూలించేది.

అసలు దుఃఖమనగానేమి? అది ఎలా మొదలవుతుంది? ఎలా వృద్ధిచెందుతుంది? అనేది ప్రత్యక్షంగా స్వానుభవంతో తెలుసుకోగలుగుతాడు. ఇప్పుడు సాధకుడు చాలా జాగ్రత్తగా ఉండి దుఃఖసముదయ గామినికి బదులు దుఃఖనిరోధగామిని మార్గాన్ని ఎంచుకొంటాడు. ఈ విధంగా సంవేదనలను ద్రష్టాభావంతో గమనిస్తూపోతే సాధకుడు "నిస్సరన" అనుభూతిని పొందుతాడు. అనగా రాగద్వేషాలకు ప్రతి క్రియచేసే అలవాటులో నుండి బయటపడగలగటము.

ఎప్పుడైతే విపశ్యన అభ్యాసం మొదలుపెడతామో అప్పుడు ఎక్కువ సమయం గుడ్డిగా సంవేదనలను ఆస్వాదిస్తూ మరికొంత రాగాన్ని – ద్వేషాన్ని జనింప చేసుకొంటూ ఊబిలో కురుకుపోయి మరికొంత దుఃఖాన్ని పెంచుకుంటుంటాము. అభ్యసించే కళ తెలుసుకొనే కొద్దీ సమతలో ఉండే సమయం పెరుగుతూ, గుడ్డిగా ప్రతిక్రియ చేసే సమయం తగ్గుతుంది. ఎప్పుడైతే రాగద్వేషాలతో కూడుకొన్న క్రొత్త సంఖారాలను (సంస్కారాలను) జనింపచేసుకోవటం ఆగిపోతుందో అప్పుడు "ఖయ" (క్షయమైపోవటం) అనుభవంలోకి వస్తుంది. అనగా గత సంఖారాల నిర్మూలనము. గతంలో మనసులో పెనవేసుకుపోయిన ముడులు వాటంతటవే పొరలు పొరలుగా పైకివచ్చి తొలగిపోతాయి. నిరోధ స్థితికి వచ్చేటంతవరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. దీనినే నిబ్బాన (నిర్వాణ)స్థితి, ఇంద్రియ జగత్తుకు అతీతమైన స్థితి అని అంటారు. ఎవరైతే విపశ్యనను సరిగా అభ్యాసంచేస్తారో వారికి ఈ పరమ సత్యం త్వరలోనే అనుభవంలోకి వస్తుంది.

నిబ్బాన (నిర్వాణ) స్థితిని అనుభవిస్తున్న క్షణాలలో మనసు పనిచేయటం ఆగిపోతుంది. అందువలన ప్రతిక్షణం జరిగే మనసు –శరీరాల స్పర్శ ఉండదు. స్పర్శలేదు కనుక సంవేదన ఉండదు. ఈ స్థితిలో ఆరు ఇంద్రియాలు పనిచేయటం మానేస్తాయి. ఇంద్రియ విషయాలతో ఇంద్రియాలకు సంధానం జరిగే అవకాశం లేదు. అందువలన ఏ సంవేదన, ఉదయించలేదు. ఇలా సాధకుడు సంవేదనలను ద్రష్టాభావంతో చూస్తూపోతే సంవేదన రహితస్థితికి చేరుకోగలుగుతాడు. బాధారహితస్థితికి చేరుకోగలుగుతాడు. భవచక్రం ఛేదించబడుతుంది.

రండి! సాధకులారా రండి! దుఃఖాన్ని పెంచిపోషించే మార్గంలో నుండి బయటపడటానికి, దుఃఖ నిరోధమార్గాన్ని అనుసరించటానికి ఉత్సాహంతో, ఓపికతో, నిరంతర పట్టుదలతో పనిచేద్దాం. అసలైన సంతోషాన్ని, అసలైన శాంతిని పొందటానికి పనిచేద్దాం.

## ప్రశ్నలకు పూజ్య గురూజీ సమాధానాలు

**ప్రశ్న: రకరకాల సత్యాలున్నాయని చాలామంది నమ్ముతారు. సత్యమనేది ఏదీ లేదని కొంతమంది నమ్ముతారు. కానీ విపశ్యన, పరమసత్యమే సత్యమనే అవగాహన కలిగిస్తున్నట్లు అనిపిస్తుంది. విపశ్యన దృష్టిలో అసలు సత్యమనగానేమి?**

జవాబు: అవును సాధారణంగా వ్యక్తులు వారివారి అభిప్రాయాలకు అనుగుణంగా సత్యాలను సృష్టిస్తారు. మనుష్యులు బుద్ధిజీవులు, కానీ బుద్ధికి పరిమితులున్నాయి. అవి మనిషి మనిషికి మారుతుంటాయి. తార్కిక స్థాయిలో ఒక వ్యక్తికి తర్కయుక్తంగా తోచేది వేరే వ్యక్తికి తర్కయుక్తంగా అనిపించకపోవచ్చు.

విపశ్యన కులమతాలకు, సాంప్రదాయాక నమ్మకాలకు అతీతమైనది. ఇది ఒక చక్కని వైజ్ఞానిక శాస్త్రము. మనస్సు – శరీరములకు సంబంధించిన శాస్త్రము. అవి ఒకదానిని మరొకటి ఏవిధంగా ప్రభావితం చేసుకొంటాయో తెలియచేసే శాస్త్రము. అయినప్పటికి ఈ వాస్తవాన్ని బుద్ధి స్థాయిలోనో లేక భక్తితోనో స్వీకరించినంత మాత్రాన సరిపోదు. ప్రతి వ్యక్తి దీనిని స్వానుభవంతో తెలుసుకోగలగాలి.

విపశ్యన సత్యముతో పనిచేస్తుంది. ఇది స్వానుభవంతో తెలుసుకొనేది. బుద్ధితో ఆడే నాటకం కాదు. సత్యాలలో స్థాయిలు ఉన్నాయి. ఒక వ్యక్తి ఒక సత్యాన్ని ఈరోజు తెలుసుకోలేకపోవచ్చు. కానీ ఏదో ఒకరోజు ప్రతి వ్యక్తి అవే సూక్ష్మసత్యాలను పూర్తిగా స్వానుభవంతో తెలుసుకోగలుగుతాడు. ఎవరో ఒక అదృష్టవంతుడు మాత్రమే తెలుసుకోగలిగే సత్యము కాదు. ప్రకృతి నియమం అందరికీ ఒకటే.

ప్రకృతికి కొన్ని మూలసూత్రాలు ఉన్నాయి. ఉదాహరణకి నిప్పు కాలుతుంది. దీనికి బుద్ధితో ఏమి సంబంధం? అది ఒక సాధారణమైన సత్యము. నీ చేయి నిప్పు మీద పెడితే కాలుతుంది. నిప్పులో ఎవరు చేయిపెట్టినా కాలుతుంది. వీరు హిందువులా, ముస్లింలా, క్రిష్టియన్‌లా అని చూడదు. ఏవిధమైన తేడాలు చూపదు.

మనోవికారాలు కూడా అలాగే పనిచేస్తాయి. మనోమాలిన్యాలైన కామము, క్రోధము, భయము మొదలగునవి జనింపచేసుకొన్నప్పుడు మనం అశాంతికి గురి అవుతాము. ఎవరో ఫలానా ఒక మతానికి చెందిన వారికి మాత్రమే ఈ ప్రకృతి నియమం వర్తించదు. ఎవరికీ తేడా చూపదు. ప్రతిచోటా, ప్రతి వ్యక్తికీ ఇది ఒక సత్యం. అదేవిధంగా మనసు మలిన రహితంగా ఉన్నప్పుడు ప్రేమతో, కరుణతో, సద్భావనతో నిండి ఉంటుంది. నిర్మలమైన మనసులో ఈ మంచి గుణాలు సహజంగానే ఉదయిస్తాయి. అప్పుడు మనం శాంతి, సామరస్యాలను అనుభవించ గలుగుతాము. ఇది ప్రకృతి నియమం. మీరు ఎవరు అనేది చూడదు.

ఒక్కసారి చేయి కాల్చుకొన్న తరువాత, నిప్పునుండి చేతులను దూరం చేసుకోవటం సహజ ప్రక్రియ అయిపోతుంది. అదే విధంగా మనోమాలిన్యాలు మనలను అశాంతికి గురిచేస్తున్నాయనే సత్యాన్ని బుద్ధితోనే కాకుండా స్వానుభవంతో తెలుసుకొన్న తరువాత ఇలాంటి మాలిన్యాలను జనింపచేసుకోకుండా జాగ్రత్తపడతాము. ఇదేదో దేవుని వాక్యం కాదు. జీవితం యొక్క నగ్నసత్యం. మనసులో వికారాలు జనింపచేసుకొంటే అశాంతికి గురి అవుతాము. ప్రకృతి ఇక్కడే, ఇప్పుడే శిక్షిస్తుంది. ఎప్పుడో చనిపోయిన తరువాత నరకానికి పోయేటంత వరకు అది వేచి యుండదు. ఇప్పుడే అది మనకు నరకాన్ని చూపిస్తుంది.

అదేవిధంగా మనసు నిర్మలమైన ప్రేమ, కరుణ సద్భావనలతో

నిండి ఉంటే ప్రకృతి మనకు ఇప్పుడే ఇక్కడే పురస్కారాన్ని ఇస్తుంది. మనసు నిర్మలంగా ఉన్నప్పుడు ప్రశాంతంగా, ఆనందంగా ఉండగలుగుతాము. అదే విపశ్యన ప్రకృతి నియమానుసారంగా జీవించటమే విపశ్యన. ఇది చాలా సులువైనది.

(అక్టోబరు 2010లో వెలువడిన ఆంగ్ల పత్రిక "విపశ్యన న్యూస్ లెటర్"లోని ప్రశ్న-సమాధానము యొక్క తెలుగు అనువాదము)

-------

## వస్త్రాభరణాల మూట

సిద్ధార్ధ గౌతముడు సమ్యక్ సంబోధిని పొంది, బుద్ధుడైన తరువాత, ఋషి పట్టణములోని మృగదావనము (ఈనాటి సారనాథ్) లో మొదటి వర్షావాసం చేశాడు. అక్కడ అరవైమంది ముముక్షువులకు విపశ్యన నేర్పి వారి ముక్తికి సహకుడయ్యాడు. అందరూ అర్హంతుయ్యారు. ఆ తరువాత ఆ అరవైమంది అర్హంత భిక్షువులను ధర్మప్రచారం కోసం వేరు-వేరు దిశలలో పంపాడు. బహుజనుల హితం కోసం బహుజనుల సుఖంకోసం నిర్దేశించబడిన దిశలలో వారంతా బయలుదేరి వెళ్ళిన తరువాత, స్వయంగా తాను తూర్పు వైపుకు పయనించి గయ చేరుకొని అక్కడ కాశ్యపబ్రాహ్మణ సాధకులకు, మరియు వారి వేయిమంది శిష్యులకు శుద్ధధర్మం బోధించాడు. ముక్తిదాయినియైన విపశ్యనను నేర్చుకుని వారంతా ధన్యులయ్యారు. ఆ తరువాత తాను పూర్వం ఇచ్చిన మాట ప్రకారం మగధనరేశునికి ధర్మం బోధించడానికి రాజగృహ (రాజగిరి) నగరం వెళ్ళాడు. మగధ రాజు బింబసారుడు శుద్ధధర్మం యొక్క సరళ, ఋజుమార్గం పట్ల ప్రభావితుడై భగవానుని అనుయాయుడయ్యాడు. బింబిసారుని కోరికపై భగవానుడు రాజగృహనగర సమీపంలోని వేణు (వెదురు) వనంలో భిక్షు సంఘంతోపాటు బస చేశాడు. అధిక సంఖ్యలో ప్రజలు భగవానుని నుండి ధర్మలాభం పొందసాగారు.

సిద్ధార్థుని తండ్రి శుద్ధోదన మహారాజుకు తన పుత్రుడు బుద్ధత్వాన్ని ప్రాప్తించుకొన్న విషయం తెలిసింది. తన పుత్రుని అమూల్యమైన ఉపలబ్ధి మరియు సఫలత విని అతడు ఎంతో సంతోషించాడు. భావోద్దీప్తుడైన శుద్ధోదనుడు కొడుకును కపిలవస్తు నగరానికి రావలసిందిగా ఆహ్వానం పంపాడు. పెద్ద సంఖ్యలో భిక్షువులు వెంట రాగా భగవానుడు లోకకళ్యాణార్థమై కపిలవస్తు వెళ్ళాడు. అక్కడి శాక్యవంశీయులు భగవానుని ఉపదేశాలు విని, అత్యంత ప్రభావితులయ్యారు. వారిలో ఎంతోమంది సద్ధర్మపథంపై అరూఢులయ్యారు. భగవానుని గృహస్తజీవన కాలం నాటి చిన్నతమ్ముడైన రాకుమారుడు నందుడు పరివ్రాజకుడయ్యాడు. పుత్రుడు రాహులుడు కూడా పరివ్రాజకుడయ్యాడు.

కొద్దిరోజులు కపిలవస్తులో గడిపిన పిదప, భగవానుడు సమీపంలో ఉన్న మల్లదేశం వెళ్ళాడు. మల్లుల కోరికపై అనుపియా అనే చిన్న నగరంలో బసచేశాడు. భగవానుడు కపిలవస్తు నుండి వెళ్ళిపోయిన తరువాత కూడా, అక్కడ ఆయన బోధించిన ధర్మమార్గం గురించి ప్రజలు చర్చించుకునేవారు. సాధన పట్ల వారిలో ధర్మసంవేగం ఉప్పొంగుతూ ఉండేది. దీనివల్ల ఎంతోమంది ప్రజలు ఇల్లూవాకిలీ వదిలి, భిక్షువులుగా మారి, భగవానుని అడుగుజాడల్లో నడిచేందుకు వెళ్ళడం పరిపాటి అయింది. ఈ క్రమంలో ఆరుగురు శాక్యవంశ రాకుమారులు మల్లదేశం వెళ్ళి భగవానుని శరణు పొందాలని నిర్ణయించుకున్నారు. శాక్యరాజు భద్దియుడు, రాకుమారులు అనిరుద్ధుడు, ఆనందుడు, భగుడు, కింబిలుడు, దేవదత్తుడు ఈ ఆరుగురూ రాస సేవకుడైన ఉపాలిని వెంటబెట్టుకుని అనుపియా నగరం వైపుకు బయలుదేరారు.

ఉపాలి వృత్తిరీత్యా మంగలి. చిరకాలంగా రాజమందిరంలో క్షురకర్మ సేవలందిస్తున్నాడు. సిద్ధార్ద గౌతముడు గృహస్థుడిగా ఉన్న సమయంలో క్షురకర్మ చేయడంతోపాటు అతనికి అలంకారపోషణ కూడా చేసేవాడు. ప్రయాణంలో సేవలు పొందడం కోసం రాకుమారులు ఉపాలి తోడుంచుకున్నారు.

రాజ్య పొలిమేరలు దాటి మల్లరాజ్యంలో అడుగుపెట్టగానే ఆ ఆరుగురు రాకుమారులూ తమ విలువైన ఆభరణాలను, వస్త్రాలను తీసివేశారు. గృహత్యాగులైన సన్యాసులు ధరించే (సాదాసీదా) సామాన్య వస్త్రాలను ధరించారు తాము త్యజించిన ఆభరణాలను, వస్త్రాలను ఒక గుడ్డలో మూటగట్టి ఉపాలికి ఇచ్చి - "తమ్ముడూ ఇవి నీకోసం! నీ శేష జీవితం సుఖంగా, హాయిగా గడపటానికి పనికొస్తాయి. వీటితో మాకు పనిలేదు. వీటిని తీసుకొని ఇక నీవు తిరిగి వెళ్ళు. మేము భగవానుని వద్ద ప్రజితులమవటానికి వెళ్తాం" అని అన్నారు.

ఉపాలి అవాక్కయ్యాడు! సంభ్రమాశ్చర్యాలతో నోటమాట రాలేదు! ఎన్ని నగలు! ఈ తరానికే కాదు తన తరువాత రెండు-మూడు తరాలకు కూడా సరిపోయే సంపద! మనసులోనే వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ, వారికి నమస్కరించి భుజం మీది మూటతో తిరుగు ప్రయాణమయ్యాడు. కొంత దూరం వెళ్లిన తరువాత అతనికి స్ఫురహ కలిగింది. "ఈ వస్త్రాభరణాల మూటతో నగరానికి వెళితే ప్రజలకు నామీద అనుమానం కలుగుతుంది. వీటిని కాజేయడానికి నేనే రాకుమారులను చంపి ఉంటానని వాళ్ళనుకోవచ్చు కూడా! అసలే శాక్యులు చండస్వభావులు. అనుమానంతో నన్ను ఉరికంబం ఎక్కించినా ఎక్కించవచ్చు! లేదా నా తల తీయవచ్చు! వద్దు బాబూ వద్దు! ఇలాంటి అయాచిత ధనం నాకొద్దు! నేను నా స్వంత కష్టంతో సంపాదించు కొనే దాంతోనే తృప్తిగా జీవనం గడుపుతాను. ఈ విలువైన వస్త్రాభరణాల మూట నాకెందుకు?" అని అనుకున్నాడు.

ఉపాలి ఆ మూటను వద్దనుకున్నాడు. దానిని వదిలించుకోదలిచాడు. ఆ మూటమీద "ఇది ఎవరికి దొరికితే వారు నిస్సంకోచంగా తీసుకొని అనుభవించవచ్చు" అని వ్రాసి, దాన్ని ఒక చెట్టుకొమ్మకు వేళ్ళాడగట్టాడు. అప్పుడతని మనసు తేలిక పడింది. "ఈ

విలువైన వస్త్రాభరణాల మూట ఎవరికి ప్రాప్తమవుతుందోగానీ వారి సంతోషానికి హద్దులుండవు. తమ భాగ్యానికి పొంగిపోతారు" అని సంతృప్తి చెందిన మనసుతో ఆ మూటవైపు చూస్తున్న ఉపాలి మదిలో ఒక ఆలోచన మెరుపులా తట్టింది. "ఇంత సుఖసౌభాగ్య సంపన్నులైన రాకుమారులు ఈ వస్త్రాభరణాలనే కాకుండా రాజసౌధంలోని ఐశ్వర్యాలను, భోగవైభవాలను కూడా త్యజించి భిక్షు జీవితం గడపటానికి వెళ్తున్నారు! అంటే, ఖచ్చితంగా ఆ ఆకించిన (నిర్ధన, నిరాడంబర, ఏమీలేని నిరుపేద) జీవితంలో రాజ్యవైభవాలకన్నా అధికమైన సుఖం ఏదో ఉండే ఉంటుంది! బుద్ధభగవానుడు కపిలవస్తులో ఉన్నన్నాళ్లు ఆయన గురించీ, ఆయన భోధనల గురించీ ఎన్నో ప్రశంసలు విన్నాను. అవశ్యంగానే ఆయన బోధించే మార్గం పరమసుఖమార్గం అయ్యుంటుంది. తప్పక నేను కూడా ఆ మార్గాన్ని అవలంబించాలి. నేను కూడా గృహత్యాగినై భగవానుని మార్గం అనుసరించాలి!"

రాకుమారులు త్యజించిన ఆ మూట, ఉపాలి మనసులో తీవ్రమైన ధర్మసంవేగాన్ని మేల్కొల్పింది. అతడు పరుగు-పరుగున వెళ్ళి ఆ ఆరుగురు రాకుమారులను కలిశాడు. "నేను కూడా మీతోపాటు బుద్ధభగవానుని శరణు పొందుతాను. వారి అనుశాసనంలో భిక్షు జీవితం గడుపుతూ మానవజన్మను సార్థకం చేసుకుంటాను" అని వేడుకున్నాడు. రాకుమారులు సంతోషించారు. ఉపాలిని తమ వెంట తీసుకెళ్ళారు.

ఏడుగురూ అనుపియా నగరం వద్ద మల్లులు ఏర్పాటు చేసిన విహారం చేరుకున్నారు. అక్కడ భగవానుడు భిక్షువులతో కలిసి బస చేస్తున్నాడు. అందరూ భగవానునికి నమస్కరించి ప్రవ్రజ్య ఇవ్వమని కోరారు. భగవానుడు వారి కోరికను మన్నించి ప్రవ్రజితులను చేయడానికి ఉపక్రమించాడు. అప్పుడు ఆ ఆరుగురు రాకుమారులు భగవానునితో అన్నారు..."భగవాన్, ముందుగా ఉపాలిని ప్రవ్రజితుణ్ణి చేయండి. ఆ తరువాత మేము ప్రవ్రజ్య తీసుకుంటాము. అలా చేస్తే ప్రవ్రజ్య జీవితంలో మాకంటే ఉపాలి జ్యేష్ఠుడవుతాడు. పూజ్యుడవుతాడు. భిక్షు నియమానుసారం మేము నిత్యం అతనికి తలవంచి నమస్కరించాల్సి ఉంటుంది. మా పూర్వసేవకుడైన మంగలికి శిరసువంచి సమస్కరించడం వల్లనే మా అహంకారం తెగుతుంది. భగవాన్! రాజపుత్రులమైన మాకు ఎంతో అహంకారముంటుంది. ఇంక శాక్యవంశీయుల సంగతి చెప్పేదేముంది? అన్ని వర్ణాల్లో శ్రేష్ఠులు క్షత్రియులు. క్షత్రియులందరిలోనూ మేము శుద్ధరక్తంగల ఇక్ష్వాకు వంశీయులమైన శాక్య క్షత్రియులం, పరమశ్రేష్ఠులం. ఈ అభిమానం ఎలా దక్కుతుంది? ముక్తి ఎలా సాధ్యపడుతుంది?"

భగవానుడు చిరునవ్వుతో వారి కోరికను మన్నించాడు. ఈ విధంగా భిక్షుజీవితంలో ఉపాలి శాక్యవంశ రాజపుత్రులకన్నా జ్యేష్ఠుడయ్యాడు. అగ్రగణ్యుడయ్యాడు. కాలం గడిచేకొద్దీ భదంత ఉపాలి, భిక్షునియమాల వినయక్షేత్రంలో భిక్షువులందరికీ అగ్రగణ్యుడయ్యాడు.

ఉపసంపద పొందిన తరువాత ఉపాలి భగవానుని వద్ద సాధనావిధిని నేర్చుకొని ఒకసారి ఇలా ప్రార్థించాడు - "భగవాన్! నాకు అరణ్యవాసానికి అనుజ్ఞ ఇవ్వండి!" కానీ భగవానుడు అతని విన్నపాన్ని సున్నితంగా తిరస్కరిస్తూ - "అరణ్యానికి వెళ్ళి సాధన చేస్తే నీలో ఏకపక్ష జ్ఞానం మాత్రమే వృద్ధి అవుతుంది. కాని ఇక్కడే విహారంలో నావద్ద ఉండి సాధన చేయడం వలన ఉభయపక్షాల జ్ఞానం అభివృద్ధి అవుతుంది. నీవు గ్రంతధుర్యుడవు మరియు విపశ్యనాధుర్యుడవు - అంటే పరియత్తి (ధర్మం యొక్క సైద్ధాంతిక పక్షం) రెండింటిలోనూ నిపుణుడవవుతావు. పరిపూర్ణుడవుతావు. కనుక అరణ్యానికి వెళ్ళకు. విహారంలోనే ఉండు" అని ప్రోత్సహించాడు.

**(తరువాయి భాగం వచ్చేనెల సంచికలో)**

**రెండు సంవత్సరాలకు చందా రూ 100/-** **విపశ్యన తెలుగు మాసపత్రిక** **జీవిత చందా రూ. 500/-**
**ప్రచురణ తేది: ప్రతినెల 30/31** **పోస్టింగ్ తేది: ప్రతి నెల 1/2** **వెల: రూ 5/-**
**విపశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు - 500 070. ఫోన్ : 24240290 (ధ్యానకేంద్రం)**
**ఆఫీసు పని చేయు వేళలు : ఉదయం 9గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు**

Postal Reg. HSE 864/2016-2018 RNI Reg. No. APTEL/2006/17745

**PRINTED MATTER**

If Undelivered please return to :
**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org

Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam.
Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.